# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-02-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్క్ ఫ్రమ్ హోమ్ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో ఈరోజు సమీక్షాసమావేశాన్ని నిర్వహిస్తున్నారు.**
2. **కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలు, ఆశలను నెరవేర్చాలా ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**
3. **ధాన్యం తేమ శాతంలో తేడాలు లేకుండా అధికారులు పరిశీలన చేయాలని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు.**
4. **రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆరోపించారు.**
5. **శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభమయ్యాయి.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు యుఎస్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి సమక్షంలో యుఎస్ ప్రతినిధులతో జీరో బడ్జెట్ నేచర్ ఫార్మింగ్‌పై అవగాహన ఒప్పందాన్ని అధికారులు చేసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి వర్క్ ఫ్రమ్ హోమ్ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షాసమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

-------------------------

కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలు, ఆశలను నెరవేర్చాలా ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. 2025-26 కేంద్రబడ్జెట్ పై తిరుపతిలో ఈ రోజు మేధావుల సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో కేంద్రమంత్రి మాట్లాడుతూ, యువత, రైతులు, పారిశ్రామిక వేత్తలు, మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని చెప్పారు.

వాయిస్ 34.. సెకన్లు

-------------------------

ధాన్యం తేమ శాతంలో తేడాలు లేకుండా అధికారులు పరిశీలన చేయాలని పౌరసరఫరాలశాఖ మంత్రి

నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. విజయవాడలోని పౌరసరఫరాలశాఖ కార్యాలయంలో నిన్న ఆయన రైస్‌మిల్లర్లతో, ప్రైవేటు గోదాముల నిర్వాహకులతో వేర్వేరుగా సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తొలిసారిగా వాట్సప్ ద్వారా ధాన్య సేకరణ ప్రక్రియ నిర్వహించామన్నారు. ఖరీఫ్ పంట కాలంలో ఇప్పటివరకు 5 లక్షల 21 వేల మంది రైతుల నుంచి 32 లక్షల టన్నుల మేర ధాన్యం సేకరించి... 7వేల 5వందల 22 కోట్ల రూపాయలు జమ చేశామని తెలిపారు.

----------------------------

రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు- ఆర్బీకే వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆరోపించారు. గుంటూరులో మిర్చి యార్డును ఈ రోజు జగన్మోహన్ రెడ్డి సందర్శించి పాత్రికేయులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏ పంటకూ గిట్టుబాటు కల్పించలేదని, రైతులకు పెట్టుబడి సాయం అందించలేదని తెలియజేస్తూ,

వాయిస్ 34 సెకన్లు

----------------------------

దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేసే బుద్ధ సర్క్యూట్లలో ఒకటి రాష్ట్రానికి కేటాయించనున్నట్లు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ హామీ ఇచ్చారని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన నిన్న కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా కేంద్రాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ సాంస్కృతిక సంస్థల్లో కళాక్షేత్ర ఆడిటోరియంలు, సాహిత్య అకాడమీ ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు.

----------------------------

నంద్యాల జిల్లాలోని శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ రోజు నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ఉదయం 9 గంటలకు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాసరావు ఈ ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం శ్రీనివాసరావు పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ రోజు నుండి 11 రోజుల పాటు జరిగే ఉత్సవాలలో స్వామి అమ్మవార్లకు విశేష అర్చనలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలుపుతూ,

వాయిస్ 32 సెకన్లు

----------------------------

దేశంలో 18 ఏళ్లు నిండిన ప్రతి భారత పౌరుడు ఓటరుగా మారి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కేంద్ర నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ సూచించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా సేవలందించిన రాజీవ్ కుమార్ పదవీ కాలం నిన్నటితో ముగియడంతో ఆయన స్థానంలో జ్ఞానేష్ కుమార్ ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో తొలి అడుగు ఓటు హక్కు వినియోగించుకోవడమేనని సూచించారు. భారత రాజ్యాంగం, ఎన్నికల చట్టాలు, నియమాలు, సూచనల ప్రకారం ఎన్నికల సంఘం తన విధులను నిర్వర్తిస్తుందని తెలిపారు.

----------------------------

ప్రభుత్వ శాఖల మధ్య భూసమస్యలు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నట్లు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా వెల్లడించారు. అటవీ, రెవెన్యూ శాఖల భూవివాదాల పరిష్కారంపై గుంటూరు జిల్లా తాడేపల్లిలో వివిధ శాఖల అధికారులతో ఆయన నిన్న ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ అభివృద్ధి చేయవలసిన భూముల వివాదాలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను నేరుగా పరిశీలించి సరిహద్దు వివాదాలను పరిష్కరించుకోవాలని ఆదేశించారు.

---------------------------

తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య వి.ఉమ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రప్రభుత్వం నిన్న పలు విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులను నియమించింది. ఇందులో భాగంగా తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి ఇన్చార్జ్‌గా ఉన్న ఆచార్య ఉమని ఉపకులపతిగా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా కృషి చేస్తానని చెప్పారు.

..వాయిస్... 28 సెకన్లు

---------------------------

పట్టణ ప్రాంతాల్లో భూ ఆక్రమణలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నక్ష సర్వే దోహదం చేస్తుందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ అన్నారు. ఒంగోలు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నక్ష సర్వేపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం దేశంలో మొత్తం 134 పట్టణ ప్రాంతాల్లో ఈ నక్ష సర్వే చేపడుతుండగా అందులో ఒంగోలు పట్టణం ఒకటని తెలిపారు. ఈ సర్వే ద్వారా అన్ని స్థలాల వివరాలను డిజిటలైజ్ చేయడం జరుగుతుందని వివరించారు.

---------------------------

గులియన్ బారీ సింద్రోమ్ వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కలుషితమైన ఆహార పదార్థాలు, త్రాగునీరు ద్వారా ఈ వ్యాధి వస్తుందని చెప్పారు. వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

======================